క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు రూరల్: విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు(మంగళవారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 05 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా జిల్లా పరిషత్ ఆఫీస్, హనుమాన్‌నగర్, గడిగడ్డ, శివాలయం రోడ్డు, ఎస్సీ కాలనీ, గొల్లవాడ, బస్‌స్టేషన్ , బండారుపల్లి రోడ్డు ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పింఛన్ దారులకు తప్పని తిప్పలు

ఏటూరునాగారం: వేలి ముద్రపడని వృద్ధులకు పింఛన్ అందే పరిస్థితి లేదు. మండల కేంద్రం లోని గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వేలి ముద్రలు పడని వృద్ధులకు తిప్పలు తప్పడం లేదు. పంచాయతీ పరిధిలోని బిల్ కలెక్టర్‌కు కుమార్‌కు వేలిముద్ర అథరైజేడ్ ఇచ్చారు. కానీ పింఛన్ ఇవ్వడం తనకు కుదరదని చెప్పడం గమనార్హం. దీంతో ఆసరా పింఛన్‌లు వేలి ముద్ర పడని వృద్ధులు పోస్టాఫీసు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదే ఇలా సమయం గడిచిపోతే పింఛన్ డబ్బులు వెనుకకు పోయే అవకాశాలున్నాయి.

సరుకుల పంపిణీ



ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని మండల తోగు గొత్తికోయగూడెంలోని గొత్తికోయలకు సోమవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. చక్రవర్తి ఆస్పత్రి డాక్టర్ తరుణ్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గూడెంలోని 30 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యంతోపాటు సరుకులను తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డితో కలిసి డాక్టర్ తరుణ్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గూడెంలోని గొత్తికోయలు అనారోగ్య కారణాలతో ఆస్పత్రికి వస్తే ఉచితంగా వైద్య సేవలు అందిస్తామన్నారు.

ఆదివాసీలకు కేటాయించాలి

మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం పాలక మండలని స్థానిక ఆదివాసీ గిరిజనులకు కేటాయించాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పూర్వం నుంచి ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలతో పూజలు నిర్వహించే ఆలయానికి పాలకమండలిని గిరిజనులతో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

వ్యక్తి అదృశ్యం

కాటారం: మండల కేంద్రానికి చెందిన కన్నెవేన తిరుపతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై-2 శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి ఈ నెల 3న కలెక్టర్ కార్యాలయంలో పని ఉందని చెప్పి ఇంటి నుంచి బయల్దేరి బైక్‌పై భూపాలపల్లికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో భార్య మమత ఫోన్ చేయగా రావడానికి గంట సమయం పడుతుందని చెప్పాడు. సాయంత్రం వరకు తిరుపతి ఇంటికి రాకపోవడంతో తిరిగి ఫోన్ చేయగా స్విచ్ఆఫ్ వచ్చింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి వద్ద ఆరా తీసిన తిరుపతి ఆచూకి తెలియలేదు. దీంతో తిరుపతి భార్య మమత సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బియ్యం దళారుల్లో గుబులు

- పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసినా.. విక్రయించినా రేషన్ కార్డులు రద్దు
- ప్రత్యేక నిఘా పెట్టిన సివిల్ సప్లై అధికారులు



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు (ఫైల్)

ఏటూరునాగారం: రేషన్ షాపుల నుంచి ప్రభుత్వం ప్రజలకు సన్న బియ్యం అందజేస్తుంది. ఇన్నాళ్లు దొడ్డు రకం, పోర్టిఫై బియ్యాన్ని కొంత మంది రేషన్ కార్డుల లబ్ధిదారులు రూ.10 కిలో చొప్పున బియ్యం వ్యాపారులకు అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకునేవారు. కాగా, ప్రభుత్వం ఇటీవల సన్న బియ్యం పంపిణీ ప్రారంభించింది. దీంతో ఇందులో కొంత మంది బియ్యాన్ని దళారులకు విక్రయిస్తున్నట్లు సివిల్ సప్లయిస్ అధికారులకు సమాచారం వెళ్లింది. పేదల కోసం ఇచ్చిన బియ్యాన్ని పేదలకే చెందాలని, అక్రమంగా దళారుల చేతుల్లోకి పావొద్దని ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. రేషన్ బియ్యాన్ని విక్రయించినా... కొనుగోలు చేసినా ఇద్దరిపై కేసులు నమోదు చేయడమే కాకుండా వారి రేషన్ కార్డులను కూడా రద్దు చేయడం జరుగుతుందని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. దీంతో పీడీఎస్ బియ్యం వ్యాపారుల్లో గుబులు నెలకొంది. ఇన్నాళ్లు ఇష్టారాజ్యంగా నడిచిన బియ్యం వ్యాపారం చెక్ పడనుంది. గతంలో కూడా ఏటూరునాగారం పోలీసు స్టేషన్ పరిధిలో మార్చి 17వ తేదీన 175 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకొని సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ఇలాంటి ఉదాంతాలు అనేకంగా ఉన్నాయి. అయితే వీటిపై సివిల్ సప్లయిస్, రెవెన్యూ, టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక దృష్టి పెట్టి రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు పెట్టి అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు.

రేషన్‌కార్డు రద్దు చేస్తాం..

పేదవాడి కడుపు నింపడానికే సన్న బియ్యం పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. బియ్యాన్ని విక్రయిస్తే లబ్ధిదారులపై, దళారులపై కేసులు నమోదు చేయడంతో పాటు రేషన్‌కార్డు రద్దు చేస్తాం. ప్రతి సేల్స్‌డిపోపై నిఘా పెట్టాం. ఎవరు కూడా అక్రమాలకు పాల్పడితే వారిని ఉపేక్షించేది లేదు.

– రాంపతి, సివిల్ సప్లయిస్ డివిజన్ మేనేజర్, ములుగు

మహనీయుల త్యాగాలతోనే స్వాతంత్య్రం

- కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు సోమయ్య



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సోమయ్య

మంగపేట: దేశానికి స్వాతంత్య్రం తీసుకురావడంలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జ్ గుమ్మడి సోమయ్య అన్నారు. మంత్రి సీతక్క, డీసీసీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు మండలంలోని కమలాపురం, మంగపేట, బోరునర్సాపురంలో మండల అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి ఆధ్వర్యంలో జెబాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతి పిత మహాత్మాగాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. మహనీయుల త్యాగాల వల్లనే దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగు నీరు



నీటిని సరఫరా చేస్తున్న అధికారులు

వెంకటాపురం(ఎం): మండలంలోని పాలంపేట ఎస్సీ కాలనీవాసులకు ఇంటింటికీ నల్లానీరు అందించనున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సునీత తెలిపారు. ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఉందని తమ దృష్టికి కాలనీవాసులు తీసుకరావడంతో సోమవారం పైపులైన్‌లకు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. ఎస్సీ కాలనీలో 624 గృహాలు ఉన్నట్లు పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు ప్రవీణ్, రాధకృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి రేవతి పాల్గొన్నారు.

తునికాకు సేకరణ టెండర్లు ప్రారంభించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ములుగు రూరల్: తునికాకు సేకరణకు టెండర్లను ప్రారంభించాలని సీపీఎం నాయకుడు రత్నం ప్రవీణ్ అన్నారు. సోమవారం అటవీశాఖ ఎఫ్ఆర్ఓ డోలి శంకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తునికాకు సేకరణతో ఆదివాసీ గిరిజనులకు ఆదాయ వనరుగా ఉంటుందని అన్నారు. తునికాకు సేకరణకు కాంట్రాక్టర్లు కల్లాలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. గతంలో తునికాకు సేకరించిన కూలీలకు డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేయడం సరికాదని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తునికాకు బోనస్ లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయాలని అన్నారు. అటవీశాఖ అధికారులు చొరవ తీసుకొని తునికాకు సేకరణకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొర్ర రాజు, సద్దాం హుస్సేన్, శోభన్, గుండబోయిన రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం



అరెస్టు చూపుతున్న పోలీసులు

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడి దొడ్డిలో గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడి దొడ్డి గ్రామంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి ద్విచక్రవానంపై 20 లీటర్ల గుడుంబాను తీసుకువస్తూ పోలీసులను చూసి పారి పోతుండగా వెంబడించి అతడిని పట్టుకున్నట్లు తెలిపారు. విచారించగా గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన కారం లచ్చిరామ్ ఛత్తీస్‌ఢ్ నుంచి గుడుంబాను తీసుకువస్తున్నట్లు తెలిపారు. గుడుంబా, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై యాకూబ్ పాషా, హెడ్ కానిస్టేబల్ చంద్ర ప్రకాశ్, నిస్సార్ ఆలీ, కానిస్టేబుల్లు మీరాజ్, నరేష్ ఉన్నట్లు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి కారల్ మార్క్స్



కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థ ఏ విధంగా ఎదుర్కోవాలో తన సిద్ధాంతం ద్వారా సూచించిన ప్రపంచ మేధావి కారల్ మారస్స్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మోటపలుకుల రమేశ్, పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ తెలిపారు. పట్టణంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం కారల్ మార్క్స్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను, శ్రామిక కార్మిక వర్గని ఏ విధంగా కాపాడుకోవాలని తన సిద్ధాంతం ద్వారా ప్రపంచానికి అందించిన గొప్ప మేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు క్యాతరాజు సతీష్, కోరిమి సుగుణ, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, పొనగంటి లావణ్య, బీమానాధుని సత్యనారాయణ, యాకుబ్ పాషా, రవీందర్, రాములు, మల్లయ్యలు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వాజేడు: మండలంలోని పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ములకనపల్లి గ్రామంలో హెచ్‌ఈఓ వేణుగోపాల కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా సికిల్ సెల్, మలేరియా వంటి జాతీయ కీటక జనిత వ్యాధులపైనే పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ.. రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీను, తిరుపతి, జయంత్ లాల్, శ్రీదేవి, శాంత కుమారి ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గోవిందరావుపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రధానోపాధ్యాయుడు కాటం మల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చల్వాయిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి జిల్లాలో, మండలంలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూళ్లలో లేని సదుపాయాలను ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



వాజేడు: వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

- విద్యుత్ శాఖ ఏడీఏ స్వామిరెడ్డి

వాజేడు/వెంకటాపురం(కె): విద్యుత్ వినియోగించే సమయంలో ప్రజలు, రైతులు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏడీఏ ఆకిటి స్వామిరెడ్డి అన్నారు. వాజేడు, వెంకటాపురం మండల కేంద్రాల్లో స్థానిక్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో సోమవారం వేర్వేరుగా విద్యుత్ భద్రతా వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు విద్యుత్‌ను ఉపయోగించుకునే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయ క్షేత్రాల్లో ఎలాంటి మరమ్మతులు వచ్చినా సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాజేడు ఏఈ అర్షద్ అహ్మద్, సబ్ ఇంజనీర్ నగేష్ కుమార్, యాకూబ్ పాషా, వెంకటేశ్వర్లు, రమేష్, సురేష్, రాజేందర్, వెంటాపురం(కె) విద్యుత్ శాఖ ఏఈ హనుమాన్ దాస్, సబ్ ఇంజనీర్ సూర్య ప్రకాశ్, సిబ్బంది ఫరీద్, పాషా, దిలీప్, వీరాస్వామి తదితరులు ఉన్నారు.

ధాన్యం సేకరణలో జాప్యం

- కొనుగోలు కేంద్రంలోనే 5 వేల క్వింటాళ్ల ధాన్యం
- లారీలు వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు



కల్లంలో ఆరబోసిన ధాన్యం

మల్హర్: లారీలు వెళ్లే దారి లేక మండలంలోని కొయ్యూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్ల జాప్యం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. గత కొన్నేళ్లుగా కొయ్యూరు ఎమ్మార్వో కార్యాలయం వెనక భాగం, రైతు వేదిక కార్యాలయం ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో సెంటర్‌లోనే రైతులు ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. లారీల రవాణా జరిగే ప్రదేశంలోని సంబంధిత భూ యజమాని అతడి భూమిలో ఫెన్సింగ్ వేసుకున్నాడు. దీంతో లారీలు వెళ్లడానికి దారిలేక పోవడంతో 10 రోజులుగా ధాన్యం సేకరణ జరగడం లేదు. దీంతో వాతావరణ మార్పుల కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. సెంటర్‌లో 5వేల క్వింటాళ్ల ధాన్యం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కొనుగోలు కేంద్రంలోకి లారీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై పీఏసీఎస్ సీఈఓ సంతోష్‌ను వివరణ కోరగా గత వానకాలం సీజన్‌లో భూ యజమాని ఫెన్సింగ్ వేయంతో ఇబ్బందులు వచ్చాయి. యజమానితో మాట్లాడి సమస్య పరిష్కరించి కొనుగోళ్లు చేపట్టాం. ప్రస్తుత సీజన్‌లో కొయ్యూరు ప్రధాన రహదారి వైన్స్ సమీపంలో సెంటర్ ఏర్పాటు చేశాం. కానీ ఇప్పటికి కొంత మంది రైతులు పాత కల్లంలోనే పోశారు. భూ యజమానితో మాట్లాడి ఈ రహదారి గుండా లోడ్ లారీల వెళ్లడానికి చర్యలు తీసుకుంటాం.

నత్తనడకన పుష్కరాల పనులు



మాట్లాడుతున్న మల్లేశ్

కాళేశ్వరం: సరస్వతి పుష్కరాలలో భక్తుల సౌకర్యాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్ల నిధులు మంజూరు చేసినా అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని సీపీఐ (ఎంఎల్) భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేశ్, యూఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు యాదవ్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం నాయకులతో కలిసి సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుష్కరాలకు ఇంకా 10 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని, నిర్ణీత సమయంలోగా పనుల్లో వేగం పెంచి నాణ్యతతో చేసేలా అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దయ్యం పోచయ్య, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వినతుల స్వీకరణ

కాటారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ద్వారా 12 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. భూ, రెవెన్యూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. సమస్యలపై విచారణ నిర్వహించి సమస్యలు పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి, ఎపీఓ వెంకన్న, ఏఈఓ రాజన్న, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భూ సమస్యకు సంబంధించిన దరఖాస్తు స్వీకరించినట్లు మహదేవ్‌పూర్ తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుప్రజ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఐకేపీ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

టేకుమట్ల: మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన మేకల మహేశ్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మృతుడి బాల్య మిత్ర బృందం సోమవారం పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం రూ.24వేల ఆర్థిక సాయం అందించారు.

కాటారం: మండలంలోని కొత్తపల్లితండాకు చెందిన కౌలు రైతు అజ్మీర జయపాల్ ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో బాధిత కుటుంబ పరిస్థితులను రైతు స్వరాజ్య వేదిక సభ్యులు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీకి వివరించారు. దీంతో వారు స్పందించి సోమవారం రూ.40 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కర్తలు, రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు కొండల్‌రెడ్డి, ఐలయ్య, చల్లగరుగుల సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులపై టార్పాలిన్ల భారం

- సరఫరా కాని సబ్సిడీ పరదాలు
- అద్దెతో అన్నదాతలకు అదనపు ఖర్చు
- ధాన్యం కాపాడుకునేందుకు తప్పని తిప్పలు



అద్దెకు తెచ్చిన టార్పాలిన్లు

రేగొండ: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు, ఆరబెట్టిందుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడుస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో 50 శాతం సబ్సిడీపై రైతులకు టార్పాలిన్లు అందించేవారు. రెండు, మూడేళ్ల పాటు పథకాన్ని కొనసాగించి తర్వాత ప్రభుత్వం ఆపేసింది. అప్పట్లో ఈ పథకంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరేది.

అద్దెకు టార్పాలిన్లు..

ప్రస్తుతం సబ్సిడీ టార్పాలిన్లు అందజేయడాన్ని ప్రభుత్వం నిలిపివేయడంతో రైతులు నానా తిప్పలు పడుతున్నారు. అద్దె టార్పాలిన్లను తీసుకు రావడంతో అన్నదాతలపై అదనపు భారం పడుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు టార్పాలిన్లను అద్దెకు ఇచ్చే దుకాణాలను గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కో టార్పాలిన్‌కు రోజుకు రూ.15 వరకు అద్దె తీసుకుంటున్నారు. సాధారణంగా ప్రతి రైతుకు కనీసం ఆరు నుంచి పది టార్పాలిన్ల వరకు అవసరం ఉంటాయి. దీంతో రోజుకు రూ.150 వరకు భారం పడుతోంది. పంట నూర్పిడి చేయడం, ఆరబెట్టడం, సంచుల్లో నింపి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించడానికి కనీసం 15 రోజుల సమయం పడుతుంది. ఈ లెక్కన రైతులపై టార్పాలిన్ల భారం దాదాపు రూ.2వేల నుంచి రూ.3 వేల వరకు పడుతోంది. ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై టార్పాలిన్లు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

అదనపు భారం



ఏటా ధాన్యం అమ్ముకునే సమయంలో టార్పాలిన్ల అద్దె కోసం రూ.3 నుంచి రూ.4వేల ఖర్చు అవుతోంది. దీంతో తమకు టార్పలిన్లు అదనపు భారంగా మారాయి. గతంలో మాదిరిగా ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు అందజేయాలి.

– నంది విజయ్, రైతు

టార్పాలిన్లు అందించాలి



రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగానే అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. ధాన్యంపై కప్పడానికి టార్పాలిన్ల కోసం ప్రైవేటు దుకాణాల వైపు పరుగులు పెడుతున్నాం. సబ్సిడీపై అందించాలి లేదా కేంద్రాల్లో టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలి.

– నిమ్మల సూర్యం,రైతు

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న బానోత్ రవిచందర్

ములుగు రూరల్: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన వీరమనేని సోమేశ్వర రావు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ సోమవారం పరామర్శించారు. నల్లెల్ల భరత్‌కుమార్, నాయకులు ఉన్నారు.